

పిఎంయువై గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు

'ప్రధాన మంత్రి ఉజ్వల యోజన' (పిఎంయువై)పథకంలో మంజూరైన ఎల్‌పిజి గ్యాస్ కనెక్షన్లను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జెసి బి.లావణ్యవేణితో కలిసి నిరుపేద లబ్ధిదారులకు ఉచితంగా సోమవారం అందించారు. 18 సంవత్సరాలు నిండిన నిరుపేద మహిళలు ఈ పథకానికి అర్హులని, అలాగే ఇంటిలో ఎలాంటి ఎల్‌పిజి కనెక్షన్ ఉండకూడదన్నారు. అర్హులుంటే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.



గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్న కలెక్టర్, జెసి

దిగుబడిపై దిగాలు..!

సరైన వర్షాలులేక ఆశాజనకంగా లేని వరిపంట


తెల్ల కంకులు ఎక్కువగా వస్తున్న దుస్థితి

ఎకరాకు రూ.30 వేల వరకూ పెట్టుబడి

దిగుబడి తగ్గుదలతో పెట్టుబడి సొమ్ము కష్టమే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ దిగుబడులపై అన్నదాత ఆందోళనకు గురవుతున్నారు. ఎకరాకు 30 బస్తాల పైబడి దిగుబడి రావడమే గగనం అన్నట్లు రైతులు భావిస్తున్నారు. అందుకు ప్రధాన కారణం సకాలంలో వర్షాలు పడకపోవడమేనని రైతులు చెబుతున్నారు. వర్షాలు లేకపోవడంతో తెల్ల కంకులు ఎక్కువగా వస్తున్నాయని, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే భారీగా పెట్టుబడి పెట్టడంతో అన్నదాత లోలోన గుబులు చెందుతున్నారు. ఖరీఫ్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఈ ఏడాది సరైన వర్షాలు కురవని దుస్థితి నెలకొంది. వర్షాకాలం నాలుగు నెల్లలో ఒక్క జులై మినహా మిగిలిన మూడు నెల్లలోనూ లోటు వర్షపాతమే నమోదైంది. మెట్ట ప్రాంతంలోని పలు మండలాల్లో వర్షాలు లేక పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. దీంతో వరి పొలాలు ఆశాజనకంగా తయారు కాలేదు. ప్రస్తుతం పొలాల్ని ఈనిక దశలో ఉన్నాయి. ప్రతి దుబ్బులోనూ ఒకటి, రెండు తెల్ల కంకులు వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈనిక పూర్తయ్యేసరికి తెల్లకంకుల శాతం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు రైతులు అంచనా వేస్తున్నారు. ఇది దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనుందని భావిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే ఎకరాకు 40 బస్తాల వరకూ దిగుబడి రావాల్సి ఉండగా 30 బస్తాలు రావడమే గగనం అన్నట్లుగా ఉందని రైతులు అంచనా. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేలకుపైగా పెట్టుబడి పెట్టామని, దిగుబడి తగ్గితే తీవ్ర నష్టాలు తప్పవని అన్నదాత ఆందోళనకు గురవుతున్నాడు. ఖరీఫ్ సాగు ఆది నుంచి రైతులను ఇబ్బందులు గురి చేస్తోంది. సరైన వర్షాలు లేక సాగునీటి కోసం రైతులు నానాతంటాలు పడ్డారు. వర్షాలు కురవకపోవడంతో ఎరువులు, పురుగుమందుల అత్యధికంగా ఉపయోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎలుకల బెడదతో రైతులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అన్ని ఆటుపోట్లు దాటుకుని ఈనిక దశలో తెల్లకంకులు వస్తుండటంతో రైతులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే కోత సమయంలో వర్షాలు కురిసే ప్రమాదం ఉందని రైతులు భావిస్తున్నారు. అదే జరిగితే అన్నదాతకు కోలుకోలేని దెబ్బ తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఖరీఫ్ దిగుబడులు ఆశాజనకంగా వస్తేనే రైతులకు రబీలో కాస్తాకూస్తో ఖర్చులకు వచ్చే అవకాశం ఉంటుంది. ఖరీఫ్ దిగుబడులు తగ్గితే రబీలోనూ రైతులకు నష్టాలు తప్పవని చెప్పొచ్చు. మరో 20 రోజుల్లో ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా ప్రారంభం కానున్నాయి. దీంతో దిగుబడులు ఏ విధంగా వస్తాయోనని భయం అన్నదాతను వెంటాడుతోంది.



వర్షాల్లేక దెబ్బతిన్న పంటలు

ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో వరి, పత్తి పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. మెట్టప్రాంతంలో వర్షాభావంతో సాగు చేసిన పంటలు ఎండిపోయిన పరిస్థితి ఉంది. చింతలపూడి, చాట్రాయి వంటి మండలాల్లో పెద్దఎత్తున పంటలు దెబ్బతిన్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఉన్న పంటలు సైతం దిగుబడి ఏ విధంగా వస్తాయోనని భయంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దెబ్బతిన్న పంటలకు సంబంధించి నష్టపరిహారం అంచనాలు నమోదు చేసి రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఎటువంటి చలనమూ లేకపోవడంతో రైతులు గుబులు చెందుతున్నారు. బీమాతోపాటు, పంట నష్టపరిహారం ఇచ్చి రైతులను ప్రభుత్వం ఆదుకుంటేనే రైతులు కోలుకునే పరిస్థితి ఉంటుంది.


ఉల్లి @ రూ.70..!

తారాస్థాయికి... తారెత్తిస్తున్న ఉల్లి ధరలు

వారం క్రితం రూ.20కి విక్రయం

నేడు రూ.70 నుంచి రూ.80కి చేరిన వైనం

సామాన్యులు బెంబేలు



ప్రజాశక్తి - చింతలపూడి

ఉల్లిపాయలను కోస్తే కన్నీళ్లు వస్తాయి.. కానీ ఇప్పుడు కొనాలంటేనే జనాలకు కన్నీళ్లు వస్తున్నాయి. గత కొన్నిరోజులుగా ఉల్లి ధరలు తారెత్తిస్తున్నాయి. మార్కెట్‌లో కేజీ ఉల్లి ధర రూ.70 నుంచి రూ.80కి చేరడంతో సామాన్యులు ఉలిక్కిపడుతున్నారు. సాధారణంగా ఇంటిలో ఏ కూరకైనా ఉల్లిపాయలు తప్పనిసరి. దీంతో ప్రతి కుటుంబంలో ఉల్లి ఉండాల్సిందే. ఈ క్రమంలో సామాన్యులు ఉల్లి కొనుగోలుకు ఆలోచించాల్సి వస్తోంది. పానీపూరి బండ్ల నుంచి బడా రెస్టారెంట్ల వరకూ అన్నింటిలోనూ ఉల్లి వినియోగం ఎక్కువగానే ఉంటుంది. వంటకాలకు అంతటి ప్రాధాన్యత ఉన్న ఉల్లి ధర నేడు ఆకాశాన్నంటడంతో ప్రజలు కొనుగోలుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల క్రితం కిలో రూ.20లోపు మాత్రమే ఉల్లి ధర ఉంది. కానీ నేడు అమాంతం సుమారు రూ.70కి చేరింది. కొద్దిరోజుల క్రితం వరకూ కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో జనాలు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ఉల్లి రేటు పెరగడంతో జనాలు ఆర్థికంగా నలిగిపోతున్నారు. ఈ ధర మరింత పెరిగే అవకాశ ఉందని వ్యాపారులు చెప్పడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. గతంలో పెరిగిన ఉల్లి ధరలను బేరీజు వేసుకుంటూ ప్రజలు కంగారుపడుతున్నారు. గతంలో ఉల్లి కష్టాలు వర్ణించలేనివి. ఉల్లి సంబంధిత వంటలను సైతం సామాన్యులు విరమించుకున్న పరిస్థితులను చూశాం. ప్రస్తుత ధరలను పరిశీలిస్తే మళ్లీ ఆ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఉల్లి కొనుగోలును కూడా జనాలు తగ్గించారు. ఐదారు కిలోలు కొనుగోలు చేసేవారు కిలో మాత్రమే కొనుగోలు చేస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు.

ఉత్పత్తి తగ్గడమే కారణమా..!

ఉల్లి ధర పెరగడానికి ఉత్పత్తి తగ్గడమే కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అంతేకాకుండా పండుగ సీజన్ కావడంతో వినియోగం పెరిగిందని, దీనివల్ల డిమాండ్ పెరిగి ధర అమాతం పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ఉల్లి ఎక్కువగా పండే మహారాష్ట్రలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట చాలావరకు దెబ్బతినిందని, దీంతో దిగుబడి పూర్తిగా పడిపోయిందని చెబుతున్నారు. సాధారణంగా ఈ సమయానికి ఉల్లి ఖరీఫ్ పంట చేతికిరావాల్సి ఉందని, అది అలస్యమవడమూ ధరలు మండటానికి మరో ప్రధాన కారణమని తెలిపారు. ఈ ఉల్లి ధర పెరుగుదల మరో రెండు నెలలపాటు ఉండొచ్చని, డిసెంబర్ నెలాఖరుకు ఖరీఫ్ పంట మార్కెట్‌లోకి వచ్చే అవకాశం ఉందని ఉల్లివ్యాపారులు చెబుతున్నారు.

ఎకరాకు రూ.30వేలు నష్టపరిహారమివ్వాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వర్షాభావంతో సాగునీరందక పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని, కృష్ణా డెల్టా శివారు ప్రాంత ఆయకట్టు పంటలకు సాగునీరందించి కాపాడాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఏలూరులోని గోదావరి సమావేశం మందిరంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో చింతలపూడి, చాట్రాయి, ముసునూరు, కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి తదితర మండలాల్లో సాగునీరు అందక వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పొట్ట, ఈనిక దశకు చేరుకున్న వరి పంట ఎండిపోయిందన్నారు. ఎకరాకు రూ.25 వేల నుండి రూ.30 వేల వరకూ రైతులు పెట్టుబడిపెట్టి నష్టపోయారని చెప్పారు. పంట చేతికి వచ్చే పరిస్థితి లేదన్నారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో మిర్చి, పత్తి పంటలకు నష్టం ఏర్పడిందన్నారు. పంట నష్టపోయిన రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరువు పరిస్థితుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కృష్ణా డెల్టాకు శివారు ప్రాంతంగా ఉన్న కైకలూరు, దెందులూరు నియోజవర్గాల్లో వరి పంటకు సాగునీరందక పంటలు బీటలు వారుతున్నాయని చెప్పారు. సాగునీరందకపోతే రైతులు నష్టపోతారన్నారు. కృష్ణా డెల్టా శివారు ప్రాంత ఆయకట్టు భూములకు సాగునీరందించి పంటలు కాపాడేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. పంట నష్టాలను వెంటనే నమోదు చేయాలన్నారు. ఎకరాకు రూ.30వేలు పరిహారం చెల్లించాలని, పంటల బీమా వర్తింపజేసి బీమా పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కృష్ణా డెల్టా కాలువలకు తగినంతగా నీరు మళ్లించి శివారు ప్రాంత పంటలకు సాగునీరందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సున్నా వెంకట్రావు పాల్గొన్నారు.

కరువు నివారణ చర్యలు చేపట్టాలి : వ్యకాస

టి.నరసాపురం : రాష్ట్రంలో కరువు నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు డిమాండ్ చేశారు. మండలంలోని ఏపిగుంట గ్రామ సచివాలయంలో స్థానిక వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి డిజిటల్ అసిస్టెంట్ వి.వీరబాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్న నారాయణరాజు, సాగిరాజు కృష్ణంరాజు, బచ్చుల కళ్యాణ్, మునమ్మ, టి.అన్నపూర్ణ, కురిశెట్టి నాగరాజు పాల్గొన్నారు.

ఎండిన వరి పంటలకు నష్ట పరిహారమివ్వాలి : సిపిఎం

జంగారెడ్డిగూడెం : విద్యుత్ కోతలు, వర్షాభావంతో పంట ఎండిపోయిన వరి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశం మండల కమిటీ సభ్యులు బొడ్డు రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి మానుకొండ జీవరత్నం మాట్లాడుతూ రైతన్న రాజ్యం అని రైతులకు మేలు చేకూరుస్తానని చెప్పిన సిఎం జగన్ ఎండుతున్న పొలాలకు నీరందించి సక్రమంగా విద్యుత్తు అందించడంలో విఫలమయ్యారన్నారు. ఎండిన పొలాలకు ఎకరాకు రూ.30 వేలు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్‌రావు, యాగంటి సీత, గరికి రాంబాబు, పటాన్ మస్తాన్, జోడే సూర్యచంద్రరావు, ఎం.ఆనందరావు పాల్గొన్నారు.

కొనసాగిన ఇవిఎం, వివి ప్యాట్స్‌ల తనిఖీ

ఏలూరు : ఈనెల 16 నుంచి ప్రారంభించిన ఇవిఎంలు, వివి ప్యాట్స్‌ల ఫస్ట్ లెవిల్ చెకింగ్ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో సజావుగా జరుగుతుందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో వివిప్యాట్స్ గొడౌన్‌లో నిర్వహిస్తున్న ఫస్ట్ లెవిల్ చెకింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా ముందుగా సిబ్బంది హాజరు పట్టికను అలాగే సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది హాజరు పట్టికను కూడా పరిశీలించారు. గొడౌన్ పరిసరాలు పరిశుభ్రతతో ఉండాలని ఎన్నికల సెక్షన్ సిబ్బందిని ఆదేశించారు. ఈ ప్రక్రియ వచ్చేనెల పదో తేదీ వరకూ నిరంతరాయంగా జరుగుతుందన్నారు. కలెక్టర్ వెంట డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర ఉన్నారు.

అభయ గోల్డ్ బాధితులకు న్యాయం చేయండి

ఏలూరు అర్బన్: అభయ గోల్డ్ కస్టమర్లకు న్యాయం చేసి వారి సొమ్మును వెంటనే తిరిగి చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం అభయ గోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఆర్.పేటలోని స్ఫూర్తి భవన్ నుండి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టర్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ 2008లో విజయవాడ కేంద్రంగా కూకట్ల శ్రీనివాస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా అభయ గోల్డ్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీని స్థాపించి, ఖాతాదారుల వద్ద నుండి రోజు, నెలవారీ డిపాజిట్ల ద్వారా తక్కువ కాలంలో ఎక్కువ మొత్తాన్ని పొందొచ్చని విస్తతంగా ప్రచారం కల్పించి రూ.174 కోట్ల ప్రజల సొమ్మును దోచుకున్నారని విమర్శించారు. మనరాష్ట్రంలోని పది జిల్లాలు, తెలంగాణాలో ఏడు జిల్లాలతో పాటు అనేక బ్రాంచీలను ఏర్పాటు చేసి నాలుగు లక్షల మంది ఖాతాదారుల వద్ద నిలువు దోపిడీ చేసి, 2013లో బోర్డు తిప్పేయడంతో బాధితులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి అభయ గోల్డ్ సంస్థ భాదితులకు న్యాయం చేసి వారి సొమ్ము చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మావూరి విజయ, అడ్డగర్ల లక్ష్మీ ఇందిర మాట్లాడుతూ అభయ గోల్డ్ ఏజెంట్లు, ఖాతా దారులు అందరూ ఐక్యంగా ఏర్పడి అభయ గోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసి వివిధ రూపాల్లో ఆందోళనల ఫలితంగా కేసులు నమోదు చేయగా ప్రభుత్వం అభయ గోల్డ్ ఆస్తులు స్వాధీనం చేసుకున్నప్పటికీ, నేటికీ బాధితులకు పరిహారం అందలేదని విమర్శించారు.

విద్యుత్ మీటరు రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి : సిఐటియు

ఏలూరుకు రీడర్ల మోటార్ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ మీటర్ రీడర్లు చేపట్టిన రాష్ట్ర మోటార్ సైకిల్ యాత్ర సోమవారం ఏలూరు పట్టణానికి చేరుకుంది. ఉదయం రాజమండ్రిలో ప్రారంభమైన ఈ యాత్ర తాడేపల్లిగూడెం మీదుగా ఏలూరు ఆశ్రం వద్ద సెంటర్‌కు చేరుకున్న సందర్భంగా జరిగిన సభలో మీటర్ రీడర్ల యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివారెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం ప్రవేశ పెట్టడం ద్వారా మీటర్ రీడర్ల ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా విద్యుత్ సంస్థలను నమ్ముకుని జీవనం సాగిస్తున్న మీటర్ రీడర్ల ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడిందని, వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని, తక్షణమే ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు. మీటర్ రీడర్లలో ఐటిఐ, టెక్నికల్ అర్హత కలిగిన వారు మీటర్ రీడర్లుగా పనిచేస్తున్నారని, వారిని షిఫ్ట్ ఆపరేటర్లగాను, వాచ్ టు వార్డ్ గాను, అలాగే కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఆఫీసుల్లో ఉద్యోగాలిచ్చి మీటర్ రీడర్లను ఆదుకోవాలని కోరారు. అనంతరం ర్యాలీగా బయలుదేరిన మీటర్ రీడర్లు ఎస్ఇ ఆఫీసుకు చేరుకుని వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనకు మీటర్ రీడర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు ఒ.శ్రీనివాస్, జిల్లా నాయకులు మల్లేశ్వరరావు, జి.దుర్గారావు, వి.శ్రీనివాసరావు, టి.జాకబ్, ఎ.సతీష్, వంశీ నాయకత్వం వహించారు.



ఏలూరుకు చేరిన మోటార్ సైకిల్ యాత్ర

వికలాంగులకు ఉపకరణాలు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో జగనన్నకు చెబుదాం... స్పందనలో అందిన అర్జీల పరిష్కారంలో చొరవచూపిన వారిని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో స్పందనలో పరిష్కరింపబడిన 16 మంది వికలాంగుల అర్జీలకుగాను ఉపకరణాలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెసి బి.లావణ్యవేణితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం స్పందనలో అందిన అర్జీల పరిష్కారంలో అత్యంత శ్రద్ధచూపిన వారిని అభినందించడంతోపాటు సంబంధిత అర్జీదారులకు ఆయా పరిష్కార పత్రాలను అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వికలాంగుల అర్జీల పరిష్కారంలో భాగంగా నలుగురికి లాప్‌టాప్‌లు, ట్రై సైకిళ్లు ఐదుగురికి, టచ్ ఫోన్ ఒకరికి, వీల్ ఛైర్లు ముగ్గురికి, వినికిడి మిషన్లు ఇద్దరికి, ఊతకర్ర ఒకరికి అందజేశారు. ఈ సందర్భంగా వికలాంగుల అర్జీల విషయంలో ప్రత్యేక చొరవతీసుకున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వికలాంగులు సంక్షేమశాఖ ఉప సంచాలకులు జిసి హెచ్.ప్రభాకర్, జిఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ ఆఫీసర్‌ను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వికలాంగులకు ట్రైసైకిళ్లు అందిస్తున్న కలెక్టర్, జెసి

జంగారెడ్డిగూడెంలో యువకుడు దారుణ హత్య

పాతకక్షలతో కోడి కత్తితో విచక్షణా రహితంగా దాడి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పాత కక్షలకు ఓ వ్యక్తి బలయ్యాడు. కోడి కత్తితో అతిదారుణంగా పొడిచి హత్య చేసిన సంఘటన పట్టణంలో కలకలం సృష్టించింది. సోమవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్డులోని గాంధీబొమ్మ సెంటర్‌కు చెందిన గోసుల ఏడుకొండలు(బాలాజీ) (27) పెయింటింగ్ పనిచేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన బాబాయి వరుస అయిన శ్రీనుకు మధ్య పాతకక్షలున్నాయి. ఈ నేపథ్యంలో 15 రోజులుగా ఒకరిపై ఒకరు బెదిరింపులకు పాల్పడుతున్నారు. సోమవారం సాయంత్రం ఇరువురి మధ్య ఉన్న వివాదాన్ని పరిష్కరించేందుకు కొందరు స్నేహితుల మధ్య కలుసుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మరోసారి వివాదం చెలరేగింది. దీంతో శ్రీను అప్పటికే తనవెంట తెచ్చుకున్న కోడికత్తితో ఏడుకొండలపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర గాయాల పాలైన అతన్ని స్థానికులు 108 వాహనంలో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికే ఏడుకొండలు పరిస్థితి విషమించి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలాజీకి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. శ్రీను ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.



మృతుడు బాలాజీ(ఫైల్)

రైతుని నిలబెట్టాలి.. వ్యవసాయాన్ని కాపాడాలి

వ్యవసాయ, ఆక్వారంగ రాష్ట్ర సదస్సు పిలుపు - సమస్యల పరిష్కారానికి రైతులు, కార్మికులు ఏకం కావాలి

ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్

వ్యవసాయం, ఆక్వా రంగాలతోపాటు ఇతర అన్ని పంటల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, వీటి మీదే ప్రధానంగా ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు, అనుబంధ కార్మికులు అనేక ఇబ్బందుల మధ్య జీవనం సాగిస్తున్నారని, ఈ నేపథ్యంలో రైతుని నిలబెట్టుకుని.. వ్యవసాయాన్ని కాపాడాలి అని వ్యవసాయ, ఆక్వారంగ సమస్యలు, ప్రభుత్వాల విధానాలు–పరిష్కారానికి ప్రత్యామ్నాయాలు'పై రాష్ట్ర రైతు సదస్సు పిలుపునిచ్చింది. వ్యవసాయం, ఆక్వాతోపాటు ఇతర పంటలను కాపాడి రైతులను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. సమస్యలు పరిష్కరించకపోతే రైతులు, కార్మికులు ఒకే తాటిపైకి వచ్చి పాలకులకు గుణపాఠం చెబుతామని సదస్సు స్పష్టం చేసింది. స్థానిక రైస్‌మిల్లర్స్ హాలులో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం రైతు రాష్ట్ర సదస్సు నిర్వహించారు. సదస్సుకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తలుగా ప్రముఖ రైతు నాయకులు వై.కేశవరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం విచ్చేశారు. సదస్సులో తీర్మానాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు ప్రవేశపెట్టారు. వ్యవసాయ, ఆక్వా రైతులతోపాటు కాయగూరలు, తమలపాకు, ఉప్పు, పండ్లు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రాష్ట్ర సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. భవిష్యత్తులో ఈ డిమాండ్ల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సదస్సు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా ముఖ్యవక్త కేశవరావు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించేలా వ్యవహరిస్తుందని విమర్శించారు. దీనికి నిదర్శనం గతంలో తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలన్నారు. అప్పట్లో రైతులు ఢిల్లీలో ప్రాణాలకు తెగించి పోరాడారని, అయితే మోడీ దిగొచ్చి చట్టాలను రద్దు చేసినప్పటికీ అప్పట్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. కృష్ణా, గోదావరి జిల్లాల్లో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో పంటలు పండే పరిస్థితి లేదన్నారు. దీనికి ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలే కారణమన్నారు. రైతులు వేలాది కోట్ల రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయడంతోపాటు ప్రాసెసింగ్, మార్కెటింగ్, అమ్మకం వెసులుబాటు కల్పించినప్పుడే వ్యవసాయం, ఆక్వారంగాలు అభివృద్ధి సాధిస్తాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు, రైతులు ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ రైతు నేత వై.కేశవరావు

15 రోజుల్లో వంద భవనాలు పూర్తిచేయాలి

ప్రభుత్వ భవన నిర్మాణాలపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ప్రాధాన్యతా భవనాల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని 15 రోజులకు వంద భవనాల చొప్పున పనులు పూర్తిచేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి సోమవారం ప్రాధాన్యతా భవనాల నిర్మాణ ప్రగతి, నాడు–నేడు, గృహనిర్మాణం, జల జీవన్ మిషన్, గ్రామీణ ఉపాధి హామీ పథకం, తదితర కార్యక్రమాల అమలును సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రాధాన్యతా భవనాల నిర్మాణ లక్ష్యాలను కలెక్టర్ నిర్దేశించారు. ఈ సందర్భంగా ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ సచివాలయ భవనాలు, ఆర్‌బికె, వెల్ నెస్ కేంద్రాల భవనాలను 15 రోజులకు వంద భవనాల చొప్పున నిర్మాణాలు పూర్తి చేసేలా లక్ష్యాలను నిర్దేశించామని, పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. జిల్లాలో ప్రాధాన్యతా భవనాల్లో చాలా భవన నిర్మాణాల్లో ఫినిషింగ్ పనులు తప్ప మిగిలిన పనులు పూర్తయ్యాయని, అధికారులు కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుని వాటిని వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నిర్మాణం పూర్తయిన ప్రాధాన్యతా భవనాలను సంబంధిత శాఖలకు వెంటనే అప్పగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే విషయంలో అలసత్వం వహించే ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ సుబ్బారావు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇలు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, డ్వామా పీడీ రాము, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - ఏలూరు

జగనన్నకు చెబుదాం–స్పందనలో అందిన అర్జీలకు సత్వరపరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జెసి బి.లావణ్యవేణి, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, ఏలూరు ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ సూర్యనారాయణరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జివివి.సత్యనారాయణ, డిపిఒ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 311 అర్జీలను స్వీకరించామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను నాణ్యతతోపాటు నిర్ధేశించిన సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు అందించిన వినతులను పరిశీలించి నాణ్యతతో వాటి పరిష్కారానికి సంబంధించిన ఫొటోతో సహా అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతీ సోమవారం మండల టీము కమిటీ అర్జీల ఆడిట్‌పై చర్చించుకోవాలన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

ఆరో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయుడి దాష్టీకం

జంగారెడ్డిగూడెం : నోట్స్ రాయలేదని ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థులను ఉపాధ్యాయుడు విచక్షణరహితంగా కొట్టిన సంఘటన స్థానిక జెడిపిహెచ్ బాలుర హైస్కూల్‌లో చోటుచేసుకుంది. సోమవారం స్థానిక జెడిపిహెచ్ బాలుర పాఠశాల ఆరోతరగతి ఉపాధ్యాయుడు రమణ నోట్స్ రాయలేదని విద్యార్థులను కొట్టడంతో ఆ విద్యార్థులు ప్రధానోపాధ్యాయురాలు లోవకుమారికి ఫిర్యాదు చేశారు. అలాగే ఓ విద్యార్థిని తల్లిదండ్రులు ఉపాధ్యాయుడు కొట్టడం వల్ల తమ కుమార్తె దెబ్బ తిన్నదని వాపోవడంతో వచ్చి అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులను ఉపాధ్యాయుడు విచక్షణ కోల్పోయి అమానుషంగా దండించడం సరికాదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానోపాధ్యాయురాలు లోవ కుమారిని వివరణ అడగగా తమను కొట్టిన విద్యార్థులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీనిపై ఉపాధ్యాయుడు రమణను మందలించినట్లు తెలిపారు. ఈ సంఘటనను ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

కొయ్యలగూడెం : వైసిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేయాలని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పిలుపునిచ్చారు. బయ్యనగూడెంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి గంగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈనెల 30 నుంచి డెందులూరులో బస్సుయాత్ర కొనసాగుతుందని, ప్రతి నియోజకవర్గంలో బస్సుయాత్ర నిర్వహిస్తామని తెలిపారు.

5న రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సమావేశం

ఏలూరు అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నవంబర్ 5వ తేదీన ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడలోని గాంధీనగర్‌లో ఉన్న ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు రవీంద్ర రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యమైన సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్ల రేషియో, వన్ బై సెటిల్మెంట్ ఫైల్, గ్రేడ్-2 వీఆర్ఓల సమస్యలు, పని ఒత్తిడి, ఉద్యోగులపై రాజకీయ నాయకుల దౌర్జన్యాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ రాష్ట్ర కమిటీ సమావేశానికి తప్పనిసరిగా, వివిధ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి

చింతలపూడి : ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని ఏలూరు ఎస్‌బి సిఐ మల్లేశ్వరావు, ఎంపిపి రాంబాబు తెలిపారు. మండలంలోని విశిష్ట ఫంక్షన్ హాల్ వద్ద పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని చింతలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ ప్రసాద్ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు నిరంతరం ప్రాణాలు సైతం లెక్కచేయకుండా విధి నిర్వహణ నిర్వహిస్తారని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో పోలీసులు, ప్రజలు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ ఆజాద్, వైసిపి నాయకులు రాజేష్ నాయుడు, చింతలపూడి వైసిపి నాయకులు రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో ఒక్కటైన ప్రేమికులు

ముసునూరు : పోలీసుల ఆశ్రయంతో ఇద్దరు ప్రేమికులు ప్రేమ వివాహం చేసుకుని దంపతులైన సంఘటన ముసునూరు మండల పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి నూజివీడు సిఐ, ముసునూరు ఎస్ఐల ఆధ్వర్యంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొర్లగుంట శివారు సింహాద్రిపురం గ్రామానికి చెందిన మాదాసి బాలు(23), కృష్ణాజిల్లా బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామానికి చెందిన భల్లి మమత(20) వీరిరువురు నూజివీడు కాలేజీలో చదువుతున్నప్పటి నుంచి ప్రేమించుకున్నారు. నూజివీడు సిఐ బాల సురేష్, ముసునూరు ఎస్ఐ యం.కుటుంబరావుల ఆధ్వర్యంలో ఇరువురుకి కౌన్సెలింగ్ ఇచ్చి ఇద్దరూ వయస్సులో మేజరులు కావడంతో పోలీస్ స్టేషన్‌లో ప్రేమజంటను కలిపి వివాహం జరిపించారు. అనంతరం తల్లిదండ్రులను ఒప్పించారు. దీంతో ఇరువురి తల్లిదండ్రులు, బంధుమిత్రుల ఆనందోత్సవాలతో జంట ఒకటైయ్యారు.

ప్రతిపక్షాలను అణచివేయడమే జగన్ లక్ష్యం

ముసునూరు : ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ పనిచేస్తున్నారని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ముసునూరు మండలం, గుడిపాడు గ్రామంలో 'బాబుతో నేను', 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో రైతులకు సాగునీరు అందడం లేదని, కనీసం బోర్ల ద్వారా పంటలను రక్షించుకుందామంటే తగినంత విద్యుత్తును సరఫరా చేయడం లేదన్నారు. కృష్ణా జలాల్లో రాష్ట్ర వాటాను తగ్గించాలని తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వైసిపి అడ్డుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గద్దె రఘుబాబు, కొల్లి గంగారామ్, మందలపు ధర్మరాజు పాల్గొన్నారు.

సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి రూ.20 లక్షలు

ఉంగుటూరు : గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా నారాయణపురం సచివాలయం-2 పరిధిలో జన సాంద్రత, ప్రజాప్రయోజనాల ప్రాధాన్యత దృష్ట్యా సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు విడుదల అయ్యాయి. ఈ నిధులను కలెక్టరు విడుదల చేస్తూ ఈనెల 26న ఉత్తర్వులు ఇచ్చారు. ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు ప్రత్యేక శ్రద్ధతో నిధుల విడుదలకు కృషి చేశారు. రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభించి పూర్తి చేసేలా చూస్తామని వైసిపి మండల కన్వీనర్ మరడ వెంకట మంగారావు పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుని కుటుంబానికి పరామర్శ

జంగారెడ్డిగూడెం : స్థానిక 8వ వార్డులో అకాల మరణం చెందిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు ముప్పిడి రాంబాబు కుటుంబాన్ని జిల్లా నారా లోకేష్ యువజన ఫౌండేషన్ అధికార ప్రతినిధి అనపరెడ్డి గంగాధర్ పరామర్శించారు. సోమవారం రాంబాబు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వర రావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

లారీ ఢీకొని భార్య మృతి

భర్తకు గాయాలు

కొయ్యలగూడెం : మండలంలోని కన్నాపురం గ్రామానికి చెందిన దర్శి పాము యేసయ్య, నాగవేణి(45) దంపతులు బైక్‌పై సోమవారం గౌరీపట్నం మేరీ మాత పుణ్యక్షేత్రం వెళ్లారు. తిరిగి దేవరపల్లి నుంచి స్వగ్రామానికి వెళుతుండగా గొల్లగూడెం వద్ద ఓ లారీ వెనక నుంచి వీరిని ఢీ కొట్టింది. అక్కడికక్కడే నాగవేణి మృతిచెందగా యేసయ్యకు గాయాలు అయ్యాయి. మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు.

గొర్రెల కాపరులపై దాడి : ఐదుగురికి గాయాలు

నూజివీడు రూరల్ : మండలంలోని మొరసపుడి గ్రామంలోని సచివాలయం వద్ద గొర్రెలకు నీళ్లు పెడుతున్న క్రమంలో సోమవారం ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నరసింహారావు అనే వ్యక్తి, అతని మేనల్లుడు గొర్రెల కాపరులపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో ఒక మహిళ, ఆమె ముగ్గురు కుమార్తెలు దాడిని ఆపటానికి ప్రయత్నించిన ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. సమీపంలోని వారు 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తులు అరెస్టు

ముసునూరు : అక్రమ మద్యం బాటిల్స్ అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం సోమవారం మండల కేంద్రమైన ముసునూరులో రజకుల బజారులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు అనుమతితో అమ్ముతున్న మద్యం సీసాలను ఓ ఇద్దరు వ్యక్తులు తమ ఇండ్ల దగ్గర చెకింగ్ చేయగా, సుమారు 20 నుంచి 30 సీసాలు అధిక రేటుకు అమ్ముతూ దొరకటంతో వారి ఇరువురిని పోలీస్ స్టేషన్‌కు రప్పించి వివరాలు అడగగారు. కూలీ పనులు చేసుకుంటూ బతికే మాకు అధిక ఆదాయం కోసం అక్రమ మద్యం వ్యాపారం చేస్తున్నామని తెలిపారు. ఇరువురుపై ఎస్ఐ ఎం.కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్ అందజేయాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఎస్‌సి, ఎస్‌టిలకు 200 ఉచిత విద్యుత్ యూనిట్లు, కరెంటు సబ్సిడీ అమలు చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో సోమవారం బుట్టాయగూడెం తహశీల్దార్ ఎస్‌కెఎస్.శాంతికి స్పందనలో వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిల 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కి విద్యుత్ శాఖ అధికారులు తూట్లు పొడుస్తున్నారన్నారు. మండలంలో ఎస్‌సిలకు 200 యూనిట్లు కరెంటు 2019 జిఓ 91 ప్రకారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం జిఓ జారీ చేయగా మండలంలో విద్యుత్ అధికారులు దానికి భిన్నంగా వ్యవహరిస్తూ ఎస్‌సిల ఇళ్ల కరెంటు కనెక్షన్ కట్ చేస్తున్నారన్నారు. దళితులపై విద్యుత్ అధికారుల దాడులను ఆపాలన్నారు. మండలంలోని రెడ్డి గణపవరంలో సోమవారం తాళ్లూరు వెంకటేశ్వరరావు ఇంటి కరెంటు లైన్‌ను కట్ చేసిన విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫ్రాన్సిస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై స్పందనలో తహశీల్దార్‌కి వినతిని ఇచ్చి సమస్యను వివరించి, ఎఇని పిలిపించి వెంటనే వెంకటేశ్వరావు ఇంటికి కట్ చేసిన కరెంటు లైన్ కనెక్షన్ ఇవ్వాలని తెలిపారు. కరెంటు కనెక్షన్ త్వరగా కలపాలని, లేనిపక్షంలో దళిత, ప్రజా సంఘాల, గిరిజన సంఘాలను ఐక్యం చేసి సబ్ స్టేషన్ దగ్గర ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

బాణాసంచాకు అనుమతి లేకుంటే కఠిన చర్యలు : ఎస్‌పి

ఏలూరు స్పోర్ట్స్ : దీపావళి పండుగను పురస్కరించుకొని సరైన అనుమతులు లేకుండా బాణాసంచా తయారు చేయటం, అమ్మకాలు జరపటం వంటి ప్రక్రియ చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో ప్రతి సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి స్వయంగా పాల్గొని ఫిర్యాదుదారుల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 45 ఫిర్యాదులు ఎస్‌పికి అందించారు. ఈ ఫిర్యాదులపై వెంటనే స్పందించిన ఎస్‌పి సంబంధిత అధికారులతో వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నేరాలు అరికట్టేందుకు పోలీసు శాఖ ఎప్పుడు సన్నద్ధంగా ఉంటుందని తెలియజేశారు. దీపావళి పండుగ రానున్న నేపథ్యంలో అక్రమంగా బాణాసంచా నిలువ ఉంచుతూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అటువంటి వారి సమాచారాన్ని డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని తెలియజేశారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని కూడా ఆమె తెలిపారు.



స్పందన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌పి మేరీ ప్రశాంతి

స్వామిత్వ సర్వేను వినియోగించుకోవాలి

టి.నరసాపురం : ప్రతిఒక్కరూ స్వామిత్వ సర్వేను వినియోగించుకోవాలని జంగారెడ్డిగూడెం డిఎల్‌పిఒ ఎండి రజావుల్లా సూచించారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామిత్వ సర్వేలో ప్రతి ఒక్కరి ఇంటి సరిహద్దులు కొలిచి యజమానికి శాశ్వత హక్కు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. నిర్దేశించిన సమయంలో స్వామిత్వ సర్వేను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ కృష్ణ పాల్గొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌పై అవగాహన

ఏలూరు : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజాప్రయోజిత సేవల శాశ్వత లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనం నందు సోమవారం పశ్చిమగోదావరి జిల్లా, కొవ్వూరు, నిడదవోలు సంబంధిత అధికారులతో శాశ్వత లోక్ అదాలత్ అందించే సేవలు పైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ ఈ శాశ్వత లోక్ అదాలత్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని, విద్య, వైద్య, పోస్టల్, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్, రవాణా, పారిశుధ్యం, బ్యాంకింగ్, ఎన్‌ఆర్‌ఇజిఎస్, టెలికాం సేవలలో లోపం జరిగిన శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించ వచ్చన్నారు. కావున సంబంధిత అధికారులు ప్రజలలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ మెంబర్ కమ్ముల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మత రాజకీయాలను ప్రోత్సహిస్తున్న మోడీ : సిపిఐ

బుట్టాయగూడెం : మత రాజకీయాలను ప్రోత్సహిస్తూ మోడీ మరలా అధికారంలోకి రావడానికి ఆరాటపడుతున్నాడని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని సొసైటీ కళ్యాణ మండపంలో పార్టీ సీనియర్ నాయకులు ఊయుకే చంద్రం, తెల్లం వీరమ్మ అధ్యక్షతన సిపిఐ మండల సమితి జనరల్‌బాడీ నిర్వహించారు. ముందుగా ఇటీవల అనారోగ్యంతో మరణించిన సిపిఐ మండల కార్యదర్శి సోదెం వెంకటేశ్వరరావు సేవలను గుర్తు చేసుకుంటూ విప్లవ జోహార్లు సమర్పించి, కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం కృష్ణ చైతన్య మాట్లాడుతూ రాజకీయ స్వార్థం కోసం మోడీ ప్రజల మధ్య చిచ్చుపెట్టి మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్నాడని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు అమలు చేయడానికి జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ ముందుంటారని ఆయన తెలిపారు. అనంతరం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన హక్కుల సాధనకై ప్రతిఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం ధారయ్య, జంగారెడ్డిగూడెం, వేలేరుపాడు, కామవరపుకోట, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి సిపిఐ మండల కార్యదర్శులు జెవి రమణ రాజు, ఎపి జిఎస్ జిల్లా నాయకులు బంధం అర్జున్, మడివి కామయ్య, కొమరం గౌతమి పాల్గొన్నారు.

'యోగాభ్యాసంతో విద్యార్థులకు ప్రయోజనం'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

యోగాభ్యాసం ద్వారా విద్యార్థులు ప్రయోజనం పొందాలని యోగా కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ సి హెచ్.ఉదయలక్ష్మి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ టివి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 45 రోజుల 'యోగ ఫర్ బెటర్ లైఫ్' సర్టిఫికెట్ కోర్స్‌ని సోమవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రపంచానికి యోగా విద్యనందించిన పతాంజలి మహర్షి గురించి తెలియజేశారు. అనంతరం కోర్సు కోఆర్డినేటర్లు సర్టిఫికెట్ కోర్స్ ప్రాధాన్యతను వివరించారు. కళాశాల సిపిడిసి కార్యదర్శి యిరదల రఘుబాబు, సభ్యులు ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చక్కని కోర్స్ రూపకల్పన చేసినందుకు కళాశాల ప్రిన్సిపల్‌ను అభినందించారు. అనంతరం యోగా శిక్షకులు కమ్ముల ఆదినారాయణ మాట్లాడుతూ మనసు, శరీరాలను సమన్వయం చేయడమే యోగ అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.అజయ్ కుమార్, ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ అధ్యక్షులు కేవి.రావు, ఏలూరు రోటరీ అధ్యక్షులు ఎన్.రోహిత్, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రావిచర్ల, జంగంగూడెం గ్రామాల్లో 'నిజం గెలవాలి'

నూజివీడు రూరల్ : మండలంలోని రావిచెర్ల గ్రామంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ రావిచర్ల సర్పంచి కాపా శ్రీనివాసరావు, గంగూడెంలోని గ్రామ పార్టీ అధ్యక్షులు పాటిమీద హనుమంతరావు ఆధ్వర్యంలో 'న్యాయం గెలవాలి' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మరీదు శివ నాగమణి, మాజీ ఎంపిటిసి లావు ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలి

ఏలూరు అర్బన్ : ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులకు రాజ్యాంగ బద్ధంగా ఉద్యోగోన్నతులలో రిజర్వేషన్ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు మెరుగు నాగార్జునను ఏలూరులో కలిసి వినతిని సమర్పించామని ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులు, టీచర్స్, ఆఫీసర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ అంగులూరి సర్వేశ్వరరావు, సెక్రటరీ జనరల్ గుగ్గులోతు కృష్ణ తెలియజేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులకు ఉద్యోగోన్నతులలో రిజర్వేషన్‌లను పరిరక్షిస్తామని తెలిపారు.

ఆరోగ్య సురక్షను వినియోగించుకోండి : ఎంపిపి

ప్రజాశక్తి - చింతలపూడి

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరు ఉపయోగించుకోవాలని ఎంపిపి రాంబాబు తెలిపారు. నగరపంచాయతీ కమిషనర్ ఎన్.రాంబాబు ఆధ్వర్యంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ స్టాల్ పరిశీలించారు. ప్రతి ఒక్కరికి పోష్టికాహారం అందించాలని ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతుందని అంగన్‌వాడీ సూపర్ వైజర్ విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ అనారోగ్య సమస్యలు ఉన్నవారు జగనన్న సురక్ష కార్యక్రమానికి వచ్చి ఉచిత వైద్య సేవలు, మందులను ఉపయోగించుకోవాలన్నారు. అవసరమైన వారికి ఇసిజి కూడా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్క కుటుంబానికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు కాంతారావు, ఇమ్మానుయేలు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ముదినేపల్లి : ప్రజల చెంతకే అత్యున్నత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ నందు సచివాలయం వన్ పరిధిలో సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, ఎంపిటిసిలు మరీదు నాగయ్య, జంపన కోటయ్య, పిఎసియస్ అధ్యక్షులు మన్నెం రమాదేవి, పార్టీ శ్రేణులు నిమ్మగడ్డ భిక్షాలు, కె.విష్ణువర్ధన్, శొంఠి కుమార్ స్వామి, తాడంకి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు 'మానవత' సాయం

ఏలూరు : మానవత విద్యానిధి ద్వారా ఆర్థికంగా వెనుకబడిన ఎనిమిది మంది విద్యార్థులకు, సావిత్రి బాయిపూలే ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ నుండి ఇద్దరు విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని సభ్యులు సోమవారం అందజేశారు. మానవత ఏలూరు యూనిట్ నెలవారీ సమీక్షా సమావేశం స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాలులో మానవత ఏలూరు యూనిట్ అధ్యక్షులు మేతర అజయ్‌బాబు అధ్యక్షతన జరిగింది. అతిథులుగా జిల్లా ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ జి.భానుశ్రీలక్ష్మి అన్నపూర్ణ ప్రత్యూష, పూలే ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్, అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మానవత కో ఛైర్మన్ మానేపల్లి సత్యనారాయణ, అడ్వయిజరీ బోర్డ్ కమిటీ సభ్యులు నాగులపల్లి సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ఏర్పాటు

నూజివీడు రూరల్ : పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రతి సోమవారం ఏర్పాటు చేసే ఈ కేంద్రంలో కూరగాయలు, బ్లాక్ రైస్, బెల్లం, పసుపు తదితర వాటిని విక్రయిస్తున్నారు. జెడ్‌పిఎన్‌ఎఫ్‌లో భాగంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు, రైతులు పేర్కొన్నారు. పురుగులమందు పిచికారీ చేయని పూర్తి సేంద్రియ ఎరువులతో కూరగాయలను విక్రయిస్తున్నామని తెలిపారు.

సీసీ రోడ్డు ప్రారంభం

నూజివీడు రూరల్ : గొల్లపల్లి గ్రామంలో దాతల సహకారంతో రూ.16 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు సీసీ రోడ్ల ప్రారంభ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సీసీ రోడ్లను గ్రామస్తులు, సర్పంచి, ఎంపిటిసి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల సమక్షంలో దాతలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భానుమతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత గోగినేని విజయ గోపాల్ పాల్గొన్నారు.

ఎంఆర్ అప్పారావు కాలనీలో తాగునీటి కష్టాలు

నూజివీడు రూరల్ : నాలుగు రోజులుగా నూజివీడు పట్టణ పరిధిలోని ఎంఆర్ అప్పారావు కాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఈ ప్రాంతంలో తాగునీటి పైపులైను పగిలిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో కాలనీవాసులు తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. సోమవారం పైపులైను మరమ్మత్తు చేయించినట్లు నూజివీడు కమిషనర్ రషీద్ తెలిపారు. తాగునీటి సరఫరా పూర్తిస్థాయిలో అందుబాటులోనికి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ముదినేపల్లిలో టిడిపి శిక్షణ

ముదినేపల్లి : టిడిపి కార్యాలయం వద్ద సోమవారం మండల అధ్యక్షులు చల్లగుల్ల శోభనాద్రి చౌదరి అధ్యక్షతన టిడిపి కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. నియోజకవర్గ పోల్ ఇన్‌ఛార్జి కొడాలి వినోద్ ఆధ్వర్యంలో ముదినేపల్లి మండల క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలకి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యాలయం నుంచి వచ్చిన కళ్యాణ్, సురేష్, విజయ్‌లు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అవగాహన కల్పించి, దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకం మరియు టైటిల్ డీడ్ పోయినది

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, ఈదర గ్రామానికి చెందిన గోళ్ళ రాంప్రసాద్ గారి భార్య గోళ్ళ సలోమి రాణికి చెందిన ఆగిరిపల్లి మండలం, ఈదర గ్రామంలో గల ఆర్.యస్.నెం. 1030/2రు దాఖలా య.1.13 సెంట్లు వ్యవసాయ భూమికి చెందిన పట్టాదారు పాసుపుస్తకం మరియు టైటిల్ డీడ్ ఒరిజనల్స్ పోయినవి. ఆచూకీ తెలిసిని వారు ఈ క్రింది అడ్రసుకి తెలియపర్చగలరు.

గోళ్ళ సలోమి రాణి
భర్త: రాంప్రసాద్, ఈదర గ్రామం,
ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా,
సెల్: 97014 15885

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, ద్వారకాతిరుమల మండలం, జి.కొత్తపల్లి గ్రామం, డో.నెం. 3-80, బోడ సురేష్ అను నాయొక్క ఒరిజినల పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం. **V4402089** ది.15-10-2023న ఒరిజినల్ పాస్‌పోర్టు తీసుకొని నా స్వగ్రామం అయిన జి.కొత్తపల్లి నుండి ద్వారకా తిరుమల మోటారు సైకిల్ మీద వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

బోడ సురేష్
డో.నెం.3-80, ఎస్.సి.కాలనీ,
జి.కొత్తపల్లి, ద్వారకా తిరుమల మండలం,
ఏలూరు జిల్లా. సెల్: 77949 15872

మహారాజశ్రీ మొదటి అదనపు జిల్లా జడ్జి (MACT) వారి కోర్టులో :: ఏలూరు
O.P.No. 850/2019

బిట్వీన్:
నేకూరి లక్ష్మి ...పిటీషనరు
అండ్
బొండాడ శ్రీనివాస్ అలియాస్ ఆటో శ్రీను (డెడ్) & వగైరాలు ...రెస్పాండెంట్లు

4వ రెస్పాండెంటు:
బొండాడ నాగేశ్వరరావు, తండ్రి: Not Known, రెసిడెన్సీ ఆఫ్ దువ్వ గ్రామం, తణుకు, తణుకు మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు గ్రంధములో 4వరెస్పాండెంటుకి తమ కోర్టు ద్వారా పంపించిన సమనులు అవి తీసుకొనుటకు కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వుల ప్రకారం **ది.15-11-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలుపు కొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించెదరు.

తణుకు, **పి.రంగారావు**
19-10-2023. పిటీషనరు తరుపు న్యాయవాది

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఐ.ఎ.నెం. 44/2023
ఇన్ ఓ.ఎస్.నెం. 2/2023

పిటీషనరు: శ్రీ రుద్ర కాశీవిశ్వేశ్వరరావు
మరియు
రెస్పాండెంట్లు: శ్రీమతి నార్ని సత్య రాజ రాజేశ్వరి వగైరా

2వ రెస్పాండెంటు: శ్రీమతి నార్ని బంగారమ్మ, భర్త: లేటు సత్యనారాయణ, ప్లాట్ నెం. 15, కొమరవరం గ్రామం, తణుకు. మరియెక నివాసం: డో.నెం. 2-131, అన్నదేవరపేట గ్రామం, తాళ్ళపూడి మండలం, తూ॥గో॥జిల్లా.

పై నెంబరులో పిటీషనరు రెస్పాండెంటు అయిన మీపై నార్ని వెంకన్న బాబుగారికి చెందిన ప్రాంశరీ నోటు బాకీ నిమిత్తం దావా ఓ.ఎస్.నెం. 2/2023 వేయడమైనది. సదరు దావాలో ఆస్తి జప్తు చేయమని పై పిటీషను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషనుపై శ్రీ కోర్టు వారు 2వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా నోటీసులు, రిజిష్టర్డు పోస్టు ద్వారాను నోటీసులు పంపుచున్ననూ మీరు తీసుకొనక Avoid చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా మీరు వాయిదా **ది.16-11-2023వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై పిటీషనుపై మీ అభ్యంతరములు తెలియజేయవలసినది.** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానం జరుగునని తెలుపడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
పెదగాడి హెచ్.వి.ఎన్.ఎస్.భూపాల్
తాడేపల్లిగూడెం, న్యాయవాది, తాడేపల్లిగూడెం.
30-10-23. సెల్: 98497 93138

'స్పందన'కు 16 అర్జీలు

నూజివీడు రూరల్ : నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సమస్యలపై డివిజన్లలోని ఆరు మండలాల నుంచి 16 అర్జీలు అందాయన్నారు. దీనిలో ఎక్కువగా భూవివాదాలకు సంబంధించి అర్జీలు వచ్చాయని, పరిష్కారం నిమిత్తం అర్జీలను సంబంధిత అధికారులకు పంపారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

రూ.26 లక్షలతో గ్రామీణ పశువైద్యశాల ప్రారంభం

కొయ్యలగూడెం : బయ్యనగూడెం గ్రామంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. రూ.26 లక్షల నాబార్డ్ నిధులతో నిర్మించిన గ్రామీణ పశు వైద్యశాలను ఆయన ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వం త్వరలో 'జగనన్న పశు వైద్య ఆరోగ్య సురక్ష' పథకాన్ని కూడా ప్రవేశపెట్టనుందని ఎంఎల్ఎ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి శ్రీలక్ష్మి, ఎంపిపి టి.గంగరాజు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకుడు మందపల్లి లక్ష్మయ్య మృతి

జంగారెడ్డిగూడెం : పట్టణానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు, మాజీ కమ్యూనిస్టు మందపల్లి లక్ష్మయ్య(78) అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక బుట్టాయగూడెం రోడ్‌లో, నూకాలమ్మ గుడి దగ్గర ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు.



సిపిఐలో రాజకీయ జీవితం ప్రారంభించి అనంతరం సిపిఎంలో చేరి ఎక్కువకాలం పనిచేశారు. అనంతరం లక్ష్మీపార్వతి ఎన్‌టిఆర్ టిడిపిలో కొంతకాలం పనిచేసిన తర్వాత 1999వ సంవత్సరంలో టిడిపిలో చేరి టిడిపి అనుబంధ సంఘమైన టిఎన్‌టియుసి నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం జిల్లా టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. లక్ష్మయ్యకు భార్య, ఇద్దరు కుమారులు కలరు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన మృతి చెందడంపై పలువురు సీనియర్ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్థానిక ప్రముఖులు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఓ.ఎస్.నెం. 2/2023

వాది: శ్రీ రుద్ర కాశీవిశ్వేశ్వరరావు
మరియు
ప్రతివాదులు:
శ్రీమతి నార్ని సత్య రాజ రాజేశ్వరి వగైరా

2వ ప్రతివాది: శ్రీమతి నార్ని బంగారమ్మ, భర్త: లేటు సత్యనారాయణ, ప్లాట్ నెం. 15, కొమరవరం గ్రామం, తణుకు. మరియెక నివాసం: డో.నెం. 2-131, అన్నదేవరపేట గ్రామం, తాళ్ళపూడి మండలం, తూ॥గో॥జిల్లా.

పై నెంబరులో దావాలో వాది గారు ప్రతివాదులైన అయిన మీపై నార్ని వెంకన్న బాబుగారికి చెందిన ప్రాంశరీ నోటు బాకీ నిమిత్తం దావా ఓ.ఎస్.నెం.2/2023 వేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు 2వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా సమన్లు, రిజిష్టర్డు పోస్టు ద్వారాను సమన్లు పంపుచున్ననూ మీరు తీసుకొనక Avoid చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా మీరు వాయిదా **ది.16-11-2023వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై దావాపై మీ అభ్యంతరములు తెలియజేయవలసినది.** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానం జరుగునని తెలుపడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
పెదగాడి హెచ్.వి.ఎన్.ఎస్.భూపాల్
తాడేపల్లిగూడెం, న్యాయవాది, తాడేపల్లిగూడెం.
30-10-23. సెల్: 98497 93138

IN THE COURT OF HON'BLE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL-CUM-XXVI ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURTS, AT :: HYDERABAD
M.V.O.P.NO. 2400 OF 2022

BETWEEN:
SMT.KOMARAPU BUJJI And others ...PETITIONERS
AND
ADDAGARLA SRINIVASA RAO And another ..RESPONDENTS

R-1 Addagarla Srinivasa Rao, S/o Nageshwara Rao, Aged: Major, Occ: Business, R/o H.No.3-15-2617, 3rd Ward, Tadepalligudem, Vangapalli gudem, West Godavari District - 534 101

The Petitioner herein had filed the O.P. claiming compensation under Section 163-A of the A.P.M.V.Act, 1988 and Rule 475 (1) (b) of A.P.M.V.Rules, 1989, R/w 163-A MV Act, Sec.140 (c) of MV Act, 1988 against you and others. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above O.P. and the matter is posted to **07.11.2023** at **10.30 a.m.** Therefore you may appear before the Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.

[BY ORDER OF THE COURT]
Sd/- C.SATISH KUMAR REDDY,
S.SANDEEP,
Advocates
H.No.3-125/36/1 Anantha Reddy Nilayam, Shanthi Nagar, Uppal, Hyderabad. Phone: 8328593303